క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పడాల శ్రీనివాసరెడ్డి

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మునిసిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్థానిక నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల తనకు పార్టీలో రాష్ట్ర స్థాయిలో పదవి కల్పించినందుకు ధన్యవాదాలు చెప్పానని స్థానిక విలేకరులకు తెలిపారు.

ఏలూరుపాడు హైస్కూల్‌కు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాళ్ల: తాము విద్యను అభ్యసించిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమని ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీవీ సత్యనారాయణరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.50 వేల విలువైన ఒక కంప్యూటర్‌ను బుధవారం ప్రధానోపాధ్యాయుడికి అందించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వాతి

కాళ్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలపై నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని ఎంపీడీఓ జి.స్వాతి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీజీఆర్ఎస్ మండల స్థాయి పరిష్కార సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మండలస్థాయి అధికారులతో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి అధికారి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి విధిగా హాజరవ్వాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన పలు అర్జీల స్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీ–4 సర్వే, హౌసింగ్, గ్రామాల్లో ఆక్రమణల తొలగింపు, ఎస్సీల స్మశాన వాటిక అభివృద్ధి పనులపై చర్చించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఎన్నార్పీ అగ్రహారంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏఓ శ్రీనివాస్.

ఉండి: వరి నాట్లు వేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎన్నార్పీ అగ్రహారంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టపరిహారం పొందాలన్నా ధాన్యం మద్దతు ధర, క్రాప్ ఇన్సూరెన్స్ ఇతర ప్రభుత్వ పథకాలు రావు అని స్పష్టం చేశారు. అలాగే రైతులు రూ.210 చెల్లించి పంట బీమా నమోద చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారి పరంజ్యోతి, వీఏఏ రాంప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పెన్నాడ గ్రామంలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు బుధవారం భోజనాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేశ్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెల ఒక రోజు ఒక వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వారికి అవసరమైన సదుపాయాలను సమకూరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్, ఎకడమిక్ డీన్ కురెళ్ళ భాస్కరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు రైళ్ల కోసం ఎదురుచూపులు



నరసాపురం-అరుణాచలం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు

ఆకివీడు: విజయవాడ-నరసాపురం బ్రాంచ్ రైల్వే లైన్ ఆధునికీకరణ పనులు పూర్తయిన నేపథ్యంలో ఈ మార్గంలో కొత్త రైళ్ల సర్వీసులను వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బ్రాంచ్ రైల్వే లైన్‌లో గత మూడేళ్లుగా గూడ్స్ వ్యాగన్లను అదనంగా తిప్పుతూ రైల్వే శాఖ ఆదాయాన్ని పొందుతుంది. అయితే కొత్త లైన్లలో ప్రయాణికుల కోసం అదనపు రైళ్లను నడపాలని ప్రజలు కోరుతున్నారు. నరసాపురం నుంచి దేశంలోని పలు పెద్ద పట్టణాలు, పుణ్యక్షేత్రాలకు రైళ్ళను నడపడం ద్వారా ప్రయాణీకులకు సౌకర్యం కల్పించడమే కాకుండా, తీర్థయాత్రల వల్ల రైల్వేకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రసిద్ధి

నరసాపురం బ్రాంచ్ రైల్వే లైన్ విజయవాడ మెయిన్‌లైన్‌కు అనుసంధానం కావడంతో ఎన్నో రోజుల నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. బ్రిటీష్ కాలం నుంచి ఈ ప్రాంతం మీదుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. కాకినాడ నుంచి నిడదవోలు బ్రాంచ్ లైన్ మీదుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ మద్రాసు వెళ్లుంది. మీటర్ గేజ్ ఉన్న సమయంలో కూడా ఈ రైలు నడిచిందని పెద్దలు చెబుతుంటారు. జై ఆంధ్ర ఉద్యమంలో సర్కార్ ఎక్స్‌ప్రెస్ చక్రాలు ఊడదీసిన సంఘటన ఆకివీడులో జరిగింది. నరసాపురం-సికింద్రాబాద్, తిరుపతి-ధర్మవరం, హుబ్లీ, పూరి-తిరుపతి, విశాఖ, కొకనాడ, శేషాద్రి, నాగర్ సోల్, త్రివేంద్రం, విశాఖ-బెంగుళూర్(లోకమాన్య తిలక్), ప్రత్యేక రైళ్లుగా నరసాపూర్-చర్లపల్లి, నరసాపుర్-యస్వంత్‌పూర్(బెంగుళూర్) రైళ్లు నడుస్తుండగా, ప్రస్తుతం అరుణాచలానికి వారానికి ఒక రోజు నడిచే విధంగా ట్రైన్ వేశారు.

కొత్త ప్రాంతాలకూ రైళ్లు నడపాలని డిమాండ్

నరసాపురం-వారణాసి, న్యూఢిల్లీ, చెన్నైకు మరో ఎక్స్‌ప్రెస్ రైలు, అరుణాచలానికి, షిర్డీకి మరో రైలు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అరుణాచలం వెళ్లే ప్రయాణికులకు తిరుగు ప్రయాణం చేసేందుకు రైల్వే సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో వలే కట్పాడి వచ్చి ప్రయాణం చేయాల్సి వస్తుందంటున్నారు. రెండు రోజులకో రైలు నడపడం ద్వారా మరింత మెరుగైన ప్రయాణ సౌకర్యం ఏర్పడుతుందంటున్నారు. నరసాపురం నుంచి ఇతర ముఖ్య పట్టణాలకు రైల్వే సదుపాయాన్ని ప్రయాణీకులకు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కోస్తా జిల్లాలకు కోటిపల్లి రైల్వే లైన్ మరింతగా ఉపయోగపడనుంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి రైల్వే లైన్‌కు మోక్షం కలుగడంతో రానున్న రోజుల్లో కోస్తా జిల్లాలకు రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది.

ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలి



బ్రాంచి రైల్వే లైన్‌లో గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరిగాయి. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని మరిన్ని కొత్త రైళ్ల నడపాలి. ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆకివీడులో నిలపాలి. గత నాలుగేళ్లుగా బ్రాంచి లైన్‌లో నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ ఆకివీడులో నిలుపుదల చేయడం ద్వారా వ్యాపారస్తులకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– మాటూరి మధు, ప్రయాణికుడు, ఆకివీడు.

కోటిపల్లి లైన్ పూర్తి చేయాలి



నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రయాణికుల సౌకర్యార్థం తీర్థయాత్రలకు అనుకూలంగా కొత్త రైళ్లు ఏర్పాటు చేయాలి. రైల్వే స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణాన్ని త్వరితగతిని పూర్తి చేయాలి. ప్లాట్‌ఫారాలపై షెడ్లనిర్మాణం పూర్తి చేయాలి.

– పాతపాటి శ్రీనివాసరాజు, ప్రయాణికుడు, పెదకాపవరం

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఆర్‌వీఎస్ సాయివర్మ

భీమవరం: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పెన్మెత్స ఆర్‌వీఎస్ సాయివర్మ బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయులు రెండు పర్యాయాలు దరఖాస్తు చేసుకున్నా వాటికి సంబంధించి నగదు మాత్రం జమ కాలేదని వాపోయారు. అయితే దీనికి సబంధించిన సొమ్ములు ఉద్యోగస్తులు, ఉపాధ్యాయుల బ్యాంక్ ఖాతాలలో జమచేసినట్లు భావించి ఇన్‌కమ్ టాక్స్ కూడా కట్టించుకున్నారన్నారు. గత ప్రభుత్వం బాకీలను క్లియర్ చేయలేదని బాధపడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయిన ఎటువంటి కదలిక లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బకాయిలన్నింటిని ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని సాయి వర్మ డిమాండ్ చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



భీమవరం ఇందిరమ్మకాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణం తాడేరు రోడ్డు ఇందిరమ్మకాలనీలో పేదలకు విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జేతు కుమార్ ఆర్థిక సహాయంతో బుధవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్‌గా పనిచేస్తున్న జేతుకుమార్ ప్రతి ఏటా పేదలకు రగ్గులు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, అంకిత్, చింతాడ శ్రీను, మావుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



ఇన్‌చార్జి చినమిల్లితో వైఎస్సార్ సీపీ నాయకులు

వీరవాసరం: గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు తెలిపారు. బుధవారం భీమవరం, వీరవాసరానికి చెందిన నాయకులు, కార్యకర్తలు చినమిల్లి వెంకటర రాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశుఘనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్ కుమార్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ చిలకపాటి సునీత, గొల్ల రాజ్ కుమార్, పట్టెం శుభాకర్, గంటా రాహుల్, అంబటి ఆనంద్ కుమార్, కవురు దిలీప్, టి.సందీప్, జవ్వాది రమా వెంకట సత్యనారాయణ, తానేటి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో కూటమి మోసం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు



పాలకోడేరులో పీవీఎల్‌ను సన్మానిస్తున్న నాయకులు కార్యకర్తలు

పాలకోడేరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, జగనన్నను ఓడించలేమని పవన్ కల్యాణ్ తో జతకట్టి ఎన్నికల ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అమాయకపు ప్రజలను మోసగించి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు విమర్శించారు. పాలకోడేరులో పార్టీ మండల అధ్యక్షుడు చెల్లబోయిన పాపారావు అధ్యక్షతన నిర్వహించిన బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని నమ్మబలికి ఇప్పుడు చేత గాక, జగనన్న దోచేశాడని మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని జగన్ 2.0 పాలన చూస్తారని వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు. అందువల్ల ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేస్తే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలని ఎండగట్టి గతంలో వైఎస్సార్ సీపీ అందించిన సంక్షేమ పాలనను వివరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఇచ్చిన హామీల్లో ఒక్క హామీ కూడా సరిగ్గా నెరవేర్చకుండా హామీలను నెరవేర్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తొలుత ఆయనను నాయకులు కార్యకర్తలు పూలదండలు వేసి సాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చేకూరి నరేంద్ర రాజు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు పెన్మత్స వెంకటరాజు, దొడ్డా విసు, పెన్మత్స శ్రీనివాసరాజు, గుండు నాగేశ్వరరావు, సీతారామరాజు, మద్దుల మౌళి, వైస్ ఎంపీపీలు ఆదాడ లక్ష్మీ తులసి, సోడ దాసి నరేష్, బొక్కా రాంబాబు, చింతలపాటి బలరామరాజు, గుంటపల్లి వెంకన్న, తోకల సాల్మన్ రాజు, గరగపద్రు అబ్బులు, పాలా రాధాకృష్ణ, డాక్టర్ డీఆర్ స్వర్ణలత, భూపతి రాజు రవికుమార్ రాజు, అంగరాజు సత్తిబాబు, కొండేటి లాజరు,గెద్దం జోషి, జాలే సునీత, పాలా చక్రధర్ రావు, పెనుమాల రిచి, శివకోడు హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు కాటూరి శాంతకుమారి, కునాదరాజు వెంకటలక్ష్మి, రంగరాజు, దంపనబోయిన లక్ష్మిదుర్గ, బుడితి నాగరాజు, కుక్కల సాయి కృష్ణ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారం సమర్పణ



బంగారం అందిస్తున్న దాతలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారి సంపూర్ణ స్వర్ణమయం కొరకు మోగల్లుకు చెందిన సీహెచ్ రామకృష్ణ- కృష్ణ కుమారి దంపతులు నాలుగు గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



భీమవరం మునిసిపల్ స్కూల్లో మాట్లాడుతున్న జడ్జి హనీష, చిత్రంలో జడ్జి జ్యోతి తదితరులు

భీమవరం: పిల్లలకు మాయమాటలు చెప్పి అపహరణ చేసే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని భీమవరం రెండవ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి హనీష చెప్పారు.బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని చింతలపాటి బాపిరాజు మునిసిపల్ హైస్కూల్‌లో జాగృతి పథకంపై అవగాహన సదస్సులో మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం కలిగితే స్కూలు యాజమాన్యానికి, తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ప్యానల్ న్యాయవాదులు ఎన్ సుధీర్, ఎంబీ భవాని, జాగృతి టీం సభ్యులు, న్యాయవాదులు పి అంబేడ్కర్, కె జ్యోతి, కె శ్రీనివాస్, ఎస్‌వీ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రక్తపు బొట్టు విలువైనదే



రాయలంలో రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదానం చేస్తున్న అధికారులు

భీమవరం అర్బన్: ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, రక్తదానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ అధికారి కె. జాషువా అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో బుధవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి రికార్డుల శాఖ అధికారి కె. జాషువా మాట్లాడుతూ నిత్యం రక్తం అవసరమై ఎంతోమంది ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎంఎస్‌వీఎస్ భద్రిరాజు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ, మల్లేశ్వరరావు, వీరభద్రచారి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

కాళ్ల: గ్రామంలో ప్రజలకు విశిష్టమైన సేవలందించి అందరి మన్ననలు పొందడం అభినందనీయమని సర్పంచ్ బందా విజయ అన్నారు. కాళ్ల గ్రామంలోని సచివాలయంలో పనిచేసి బదిలీ పై వెళ్తున్న సిబ్బందికి బుధవారం గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పన్నాసి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, ఎంపీటీసీ సభ్యురాలు పాపోలు సత్యవతి పాల్గొన్నారు.

గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్ట్

పెనుగొండ: గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్ట్ తయారు చేయవచ్చని, తద్వారా సంపద సృష్టి చేయవచ్చని ఆచంట ఎంపీడీఓ బిక్కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



తాడేరులో ఫసల్ బీమా పథక నమోదును పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్

భీమవరం అర్బన్: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో బుధవారం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోలేని రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం నమోదు ప్రక్రియను ఏవో ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15లోపు పంటల బీమా పథకానికి ప్రీమియం ఎకరానికి రూ. 210 చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయినప్పుడు నష్ట పరిహారం చెల్లిస్తారన్నారు. కౌలు రైతులు, రుణాలు తీసుకోని రైతులకి కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



జల్లా కొండయ్య

భీమవరం అర్బన్: మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో గురువారం నిర్వహించే బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య బుధవారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కర్త ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ లైన్‌మెన్‌పై అవినీతి ఆరోపణలు

ఉండి: మండలంలోని అర్తమూరు, చెరుకువాడ జూనియర్ లైన్‌మెన్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఎల్ఎం అనధికారికంగా మీటర్ల రీడింగ్ తీయడంతో పాటు, ఆక్వా రైతుల వద్ద నుంచి కరెంట్ బిల్లు సొమ్మును వసూలు చేసినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా టెక్నాలజీ సాయంతో ఆక్వా రైతులకు ఎక్కువ బిల్లు వచ్చినట్లు చూపి, అనంతరం వారి నుంచి వసూలు చేసిన సొమ్ములో అసలు బిల్లు కట్టి మిగిలిన సొమ్ము వెనకేసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల అర్తమూరు గ్రామానికి చెందిన ఓ రైతు ఆక్వా సాగు చేయకుండా చెరువు ఎండబెట్టుకున్నాడు. అయితే అతనికి వేలల్లో విద్యుత్ బిల్లు వచ్చింది. దీంతో అతను సమీప రైతులను ఆరాతీయగా వారికి కూడా ఇదే స్థాయిలో బిల్లు రావడంతో వారు భీమవరంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి(ఈఆర్ఓ) వెళ్లి ఆరా తీశారు. దీంతో అక్కడి అధికారులు ఉండి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శాఖాపరమైన విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై ఉండి ఎలక్ట్రికల్ ఏఈ ఫోన్ చేసి జేఎల్ఎంను ఆరా తీయగా తన వద్ద అడిషినల్ కంజప్షన్‌లో భాగంగా ఆరు సర్వీసులకు సంబంధించి రూ.89738 బిల్లు నగదు ఉందని చెప్పడంతో దానిని వెంటనే కట్టించారు. అనంతరం కొందరు మధ్యవర్తులకు సమస్య పరిష్కరించాలని రూ.5.60 లక్షలు చేతులు మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో లైన్‌మెన్ సొంత గ్రామం వాడే కావడంతో ఆక్వా రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఈ విషయంపై మండల విద్యుత్ ఏఈ పులగం శ్రీనివాసరావును వివరణ కోరగా జేఎల్ఎంపై ఆరోపణలు రావడం నిజమేనని, వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని తెలిపారు. ఆరోపణలు నిజమని తేలితే అతడిపై విద్యుత్ చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ విషయంపై ఏడీఈ మాట్లాడుతూ బిల్లులు కట్టించుకోవడం ,రీడింగ్ తీయడం జేఎల్ఎం పనికాదని, కాబట్టి శాఖాపరమైన విచారణ చేస్తున్నామని వివరించారు. సదరు జేఎల్ఎంపై గురు, శుక్రవారల్లో బదిలీ లేదా సస్పెన్షన్ వేటు పడవచ్చని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

వాటర్ ట్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్డు ధ్వంసం



లోసరి- కొత్తపూసలమర్రు గ్రావెల్ రోడ్డుపైకి వస్తున్న వృథా నీరు

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి గ్రామం పంచాయతీ రక్షిత మంచినీటి చెరువు వద్ద తాగునీటిని సరఫరా చేసే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొత్తపూసలమర్రు – లోసరి వెళ్లే గ్రావెల్ రోడ్డు ధ్వంసమవుతుంది. 216 జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఈ రోడ్డు మార్గం నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు ఆర్ అండ్‌బీ పరిధిలో లేకపోవడంతో గత నాలుగేళ్ల క్రితం రైతులు స్వచ్ఛంధంగా నగదును సమీకరించి గ్రావెల్ వేయించారు. అయితే ఈ రోడ్డుకు సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు నీటిని నింపి మోటార్లు కట్టకపోవడంతో ఆ నీరు రోడ్డుపైకి వచ్చి భారీ గోతులు ఏర్పడుతున్నాయి. అష్టకష్టాలు పడి స్వచ్ఛందంగా రోడ్డు వేస్తే వృథా నీటి ద్వారా రోడ్డు ధ్వంసమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు కాని, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.